## క్లుప్తంగా

### జాకబ్ రాజుకు చిత్రరత్న గోల్డెన్ అవార్డు


గోల్డెన్ అవార్డు అందుకుంటున్న జాకబ్ రాజు

గోపాలపట్నం: కోనసీమ చిత్రకళాపరిషత్ సంస్థ నిర్వహించిన 33వ అంతర్జాతీయ ఆర్ట్ పోటీల్లో గోపాలపట్నం ప్రశాంతినగర్‌కు చెందిన విశ్రాంత ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జాకబ్ రాజు చిత్రరత్న గోల్డెన్ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును ఆదివారం అమలాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడిపూడి సత్యశైలజ భరత్, ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు అందించారు. ఈ సందర్భంగా రాజుకు పలువురు అభినందనలు తెలిపారు.

### వీధిదీపాల ఏర్పాటు


బీఆర్‌టీఎస్ రహదారిలో విద్యుత్ దీపాలు వేస్తున్న సిబ్బంది

గోపాలపట్నం: గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రహదారిలో విద్యుత్ దీపాల మరమ్మతు పనులు చేపట్టారు. జీవీఎంసీ విద్యుత్ విభాగం అధికారులు రెండు రోజులుగా వెలగని వీధి లైట్లను గుర్తించి వాటి స్థానంలో కొత్త దీపాలు వేస్తున్నారు. ఈ ప్రక్రియ మరో రెండు రోజులు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. వీధి దీపాలు వెలుగుతున్న తీరును కూడా పరిశీలిస్తామని చెప్పారు.

### జేసీని కలిసిన బీఎస్ కృష్ణ


జేసీ విశ్వనాథన్‌కు పుష్పగుచ్ఛమందిస్తుస్తున్న ఏఎంసీ చైర్మన్ బీఎస్ కృష్ణ

గోపాలపట్నం: జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్‌ను ఆయన కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. రైతు బజార్లలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను జేసీ దృష్టికి తీసుకెళ్లారు. స్టాళ్లలో అసౌకర్యాలు, టాయిలెట్ల నిర్వహణ లోపాలను ఆయనకు వివరించారు. వీటిపై జేసీ సానుకూలంగా స్పందించారని బీఎస్ కృష్ణ చెప్పారు.

### చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ


పౌష్టికాహారం అందిస్తున్న పెద్దిరెడ్ల నానాజీ

మల్కాపురం: సామాజిక సేవా కార్యకర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్దిరెడ్ల నానాజీ 58వ వార్డు శ్రీహరిపురం అంగన్‌వాడీ విద్యార్థులకు మంగళవారం బిస్కెట్లు,పండ్లు పంపిణీ చేశారు. తన వంతు సాయంగా ప్రతి నెలా చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్టు వివరించారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరం రేపు

గోపాలపట్నం: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 26న బెహరా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ బెహరా రవితేజ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. అభిమానులు, రక్తదాతలు స్వచ్ఛందంగా పాల్గొవాలని కోరారు. అలాగే అవుట్ పేషంట్లకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు.



# తొలగిస్తున్నా.. అతికించేస్తున్నారు!

- పోస్టర్లతో కళావిహీనంగా ఎన్‌ఏడీ బ్రిడ్జి
- జీ-20 సదస్సు నేపథ్యంలో సుందరంగా తీర్చిదిద్దాలని స్థానికుల డిమాండ్


ఎన్‌ఏడీ జంక్షన్ వంతెన పిల్లర్లపై తొలగించిన పోస్టర్లు


పోస్టర్లు అతికించడంతో అధ్వానంగా తయారైన గోడలు

గోపాలపట్నం: నగరానికే తలమానికంగా ఉన్న ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ వంతెన కళావిహీనంగా మారుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రోటరీ విధానంలో ఈ వంతెన నిర్మాణం చేపట్టింది. ఇక్కడ మూడు రోటరీలు ఉన్నాయి. కిందనున్న రోటరీ ద్వారా అన్ని వైపుల నుంచి ఎవరు ఎటు వైపు అయినా వెళ్లిపోవచ్చు. మధ్యలోని రెండో రోటరీని కాలినడకన అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు వెళ్లేవారికి కేటాయించారు. పైనున్న రోటరీ జాతీయ రహదారిపై వెళ్లే భారీ వాహనాలతో పాటు ఇతర వాహనాలకు, కరాస నుంచి పెందుర్తి వైపు బీఆర్‌టీఎస్ మార్గంలో వెళ్లే వాహనాలకు ఉద్దేశించారు. ఈ వంతెన మీదుగా గాజువాక, గోపాలపట్నం, మద్దిలపాలెం, కంచరపాలెం వైపు వాహనచోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెన నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యకు చెక్ పడింది. అయితే ఈ వంతెన గోడలు, పిల్లర్లపై ఇష్టారీతిన పోస్టర్లు అతికించడంతో అధ్వానంగా తయారైంది. జీవీఎంసీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వాటిని తొలగిస్తున్నా.. తరగడం లేదు. వంతెన చుట్టూరా దారి పొడుగునా అర్ధ రాత్రి సమయంలో పోస్టర్లు అతికిస్తున్నారు. దీంతో ఈ వంతెన కళావిహీనంగా మారింది. విశాఖలోని ప్రధాన కూడళ్లలో ఎన్‌ఏడీ కూడలికి ప్రాధాన్యం ఉంది. వంతెన గోడలు, పిల్లర్లపై సంప్రదాయ బొమ్మలు వేస్తే ఆకర్షణీయంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. జీ-20 సమావేశాల నేపథ్యంలో ఈ వంతెనను సుందరీకరించాలని కోరుతున్నారు. ఇష్టానుసారంగా పోస్టర్లను అతికిస్తున్న వారికి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఖాతాదారులకు చేరువగా సేవలు


వినియోగదారుడికి పత్రాలు అందిస్తున్న బ్యాంక్ అధికారులు

గోపాలపట్నం: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న రుణాలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ కేంద్ర కార్యాలయ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాధా కృష్ణన్ అన్నారు. గోపాలపట్నం బ్యాంక్ ప్రధాన శాఖలో మంగళవారం నిర్వహించిన రుణమేళాలో ఆయన మాట్లాడారు. తక్కువ వడ్డీతో సులభమైన వాయిదా పద్ధతుల్లో చెల్లించేలా రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. మొత్తం రూ.8 కోట్ల రుణ మంజూరు పత్రాలను వినియోగదారులకు అందించారు. కార్యక్రమంలో రీజనల్ హెడ్ కె. నటరాజన్, ఎంఎల్‌పీడీ ఎంపీ తిలక్, ఆర్‌ఎల్‌పీ హెడ్ ఎస్. రమేష్, గోపాలపట్నం బ్రాంచ్ మేనేజర్ జి. చైతన్య రాణి తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్ల ఇంటికి ఆభరణం

**బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం**


కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషన్ సభ్యుడు గొండు సీతారాం

సబ్బవరం: ఆడపిల్లలు ఇంటికి ఆభరణం వంటివారు.. వారిని భారంగా భావించ వద్దు అని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ,రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని బాలికలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ దేశంలో లింగ వివక్ష,నిరక్షరాస్యత వంటి దీర్ఘకాలిక సమస్యలు దశాబ్దాలుగా వెంటాడుతూనే ఉన్నాయన్నారు. బాలికల హక్కుల ఉల్లంఘన, ఆడపిల్లలను విద్యకు దూరంగా నెట్టివేయడం,ఆడ పిల్లల్లో పోషకాహార లోపం, అనధికార విక్రయాలు వంటి పరిణామాలు జరుగుతుండడం విచారకరమన్నారు. వీటిని సమూలంగా రూపుమాపాలన్న లక్ష్యంతో ఆడ పిల్లలను ఆరోగ్యంగా ఎదగనిద్దాం, ఉన్నత విద్య అందిద్దాం,అబ్బాయిలతో సమానంగా విద్యా,ఉద్యోగ అవకాశాలు కల్పిద్దాం అనే నినాదంతో రాష్ట్రప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. దీనికోసం కోట్లాదిరూపాయిలు వెచ్చించి రాష్ట్ర ప్రభుత్వం ఆడ పిల్లలపై ఉండే అభిమానాన్ని,బాధ్యతను చాటుకుంటుందన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కూడా ఆడపిల్లల హక్కులతో ముడిపడి ఉన్న అనేక అంశాలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు,సబ్బవరం ఐసీడీఎస్,చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ వి. లలిత్ కుమారి, అసిస్టెంట్ సాంఘిక సంక్షేమ అధికారి సత్యవతి, తహసీల్దార్ బి. సత్యనారాయణ, ఎంపీడీవో రమేష్ నాయుడు, పోలీస్ అధికారులు, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు,అంగన్‌వాడీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్నప్రసాదంలో పురుగు


అన్నప్రసాదంలో వచ్చిన పురుగు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలోని అన్నప్రసాద భవనంలో మంగళవారం భక్తుడు అన్నప్రసాదం స్వీకరిస్తుండగా పురుగు కనిపించడంతో కంగుతిన్నాడు. ఈ విషయంపై అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని అడిగినా ఎవరూ పట్టించుకోలేదని వాపోయాడు. వివరాలు... నగరంలోని సీతంపేట ప్రాంతానికి చెందిన రమణ మూర్తి అనే భక్తుడు కుటుంబసమేతంగా మంగళవారం స్వామివారి దర్శనానికి వచ్చాడు. దర్శనానంతరం అన్నప్రసాద భవనంలో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో అన్నప్రసాదం స్వీకరిస్తుండగా పురుగు కనిపించింది. ఈ విషయంపై వడ్డన చేస్తున్న వారిని, అక్కడ ఉన్న సిబ్బందిని అడగ్గా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో విషయాన్ని మీడియా దృష్టికి తీసుకెళ్లాడు. అక్కడ సిబ్బందిని ప్రశ్నించినా ఎవరూ బాధ్యతగా వ్యవహరించలేదని ఆరోపించారు. ఈ విషయంపై అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ నరసింగరావును వివరణ కోరగా అన్నప్రసాద విభాగంలో పరిశుభ్రతతో పదార్థాలు సిద్ధం చేస్తామని తెలిపారు. అన్నప్రసాద భవనంలో అందుబాటులోనే ఉన్నానని, పురుగు వచ్చిన విషయాన్ని సదరు భక్తుడు తన దృష్టికి తీసుకురాలేదని చెప్పారు. ఈ విషయంపై లిఖితపూర్వకంగా కూడా ఫిర్యాదు చేయలేదన్నారు. మరింత శ్రద్ధతో అన్నప్రసాదాలు తయారు చేస్తామన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి


మంత్రి అమర్‌నాథ్‌కు సమస్యలు విన్నవిస్తున్న షిప్‌యార్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

సింధియా: షిప్‌యార్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని హిందూస్తాన్ షిప్‌యార్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కోరారు. మంగళవారం మంత్రిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎల్‌అండ్‌ఎం సీరిస్ కార్మికుల రెగ్యులరైజేషన్, రిటైర్డ్ ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు తదితర విషయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి షిప్‌యార్డ్ యాజమాన్యంతో చర్చించి సమస్యలు పరిష్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు సత్యానందరావు, బుగ్గారెడ్డి, ఆనందకుమార్, పాత్రో, ఎస్.వి.రమణ, గురునాథరావు తదితరులు ఉన్నారు.

## 'ఉక్కు' పరిరక్షణకు దేశవ్యాప్త ఉద్యమాలు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని అమ్మాలనే దుర్మార్గపు ఆలోచనను విరమించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. లేకుంటే పోరాటాల ద్వారా కేంద్రానికి తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 712వ రోజు మంగళవారం బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. దీక్ష శిబిరంలో ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు, విళ్లా రామ్మోహనకుమార్, యు.రామస్వామి, ఎస్.రామారావు, సీహెచ్.సన్యాసిరావు ప్రసంగించారు. ప్రజల సంపదైన విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్త ఉద్యమాలకు సిద్ధమన్నారు. ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న ఉక్కు ప్రజాగర్జనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ నాయకులు ఆర్.వెంకటరావు, డి.శ్రీనివాస్, రవికుమార్, గుమ్మడి నరేంద్ర, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

## ఉద్యోగాల కోసం నిరీక్షించవద్దు


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

మల్కాపురం: ఎవరో వస్తారు..ఏదో చేస్తారని ఆశపడి విలువైన సమయాన్ని యువత వృథా చేసుకోవద్దని విశాఖ డెయిరీ మార్కెటింగ్ ప్రతినిధి సూర్య ప్రకాష్ అన్నారు. ఉన్నత చదువు చదివి ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా రాష్ట్ర ప్రభుత్వం అందించే సాయంతో పల్లివీధి ప్రాంతానికి చెందిన సమ్మిడి రాజు పార్లర్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని ప్రారంభించిన ఆయన యువత ఆదర్శంగా మెలగాలని, స్వయం ఉపాధి ద్వారా పలువురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు.

## విద్యార్థులూ.. ఉన్నతంగా ఎదగండి


విద్యార్థులతో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ బహుమతులు ప్రదానం చేశారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం జీవీఎంసీ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ విద్యార్థులను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మేటిగా నిలుస్తుండటం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎన్నో పథకాలు అమలు చేస్తోందని.. విద్యార్థులు ఈ అవకాశాలను వినియోగించుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

## కల్యాణం.. కమనీయం


అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు చక్రపాణి, ఆత్మకూరి రవి తదితరులు కల్యాణం జరిపారు.

## గోపాలపట్నంలో స్పెషల్ డ్రైవ్


ఫుట్‌పాత్‌పై ఉన్న బళ్లను తొలగిస్తున్న ట్రాఫిక్, టౌన్ ప్లానింగ్ అధికారులు

గోపాలపట్నం: గోపాలపట్నం బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారిలో ఫుట్ పాత్ ఆక్రమణలపై ట్రాఫిక్ పోలీసులు, సచివాలయ కార్యదర్శులు మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గోపాలపట్నం రైల్వే స్టేషన్ రోడ్డు నుంచి ఎల్జీ పాలిమర్స్ జంక్షన్ వరకు ఈ డ్రైవ్ చేపట్టారు. రోడ్డుపై, ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన దుకాణాలు, తోపుడు బళ్లను తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహనాల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో దుకాణాలు ఇబ్బందిగా తయారవుతున్నాయని తెలిపారు. సీఐ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో 91, 92 టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు దామోదర్, పాత్రుడు, బాలాజీ, రాజేష్, ఆదిత్య, ఈశ్వర్, సత్యనారాయణ, సుశీల, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## 26న మెగా రక్తదాన శిబిరం


మాట్లాడుతున్న కార్పొరేటర్ సురేష్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు పరిధి గుల్లలపాలెంలో ఈ నెల 26న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు, పి.వి.ఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ పి.వి.సురేష్ తెలిపారు. స్థానిక ఫంక్షన్‌హాలులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ట్రస్ట్ 7వ వార్షికోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేవలం పది మందితో ఏర్పడిన ట్రస్ట్‌లో ఈ రోజు 1000 మందికి పైగా భాగస్వాములయ్యారని.. వారి సహాయ సహకారాలతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. తొలి రోజుల్లో రక్తదాన శిబిరాల ద్వారా 180 యూనిట్లు రక్తం సేకరిస్తే.. గతేడాది 990 యూనిట్లు సేకరించినట్లు చెప్పారు. శిబిరాల ద్వారా అత్యధిక యూనిట్ల రక్తం సేకరించిన ఘనత తమ ట్రస్ట్‌కే దక్కుతుందన్నారు. భవిష్యత్‌లో తన సేవలను మరింత విస్తరిస్తానని.. 26న జరిగే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పలు బ్లడ్ బ్యాంక్‌ల నిర్వాహకులు పాల్గొన్నారు.

## ముస్తాబైన నర్సింగబిల్లమ్మ ఆలయం


నర్సింగబిల్లమ్మ ఆలయం

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం జనతాకాలనీ సమీప గొల్ల పేటలో నూతనంగా నిర్మించిన నర్సింగబిల్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి విశేష పూజలు నిర్వహించనున్నారు. అమ్మవారి ప్రతిష్టసంకల్పం, విఘ్నేశ్వర పూజ, యాగాలు, దీపారాధన , జలధివాసము, క్షీరాధివాసము, వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 26న ఉదయం 9.45 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట శాస్త్రోక్తంగా జరుగుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. అనంతరం చండీ హోమం , జయాధి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఏర్పాట్లను ఆలయ నిర్మాణ దాత కేవీ బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షిస్తున్నారు.

## సందడిగా రాములోరి పరస


పరసలో పాల్గొన్న భక్తులు


రామాలయంలో స్వామి దర్శించుకున్న దొడ్డి కిరణ్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌లో రాముల వారి తీర్థం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శించుకుని విశేష పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం చంద్రనగర్ ప్రధాన రహదారిలో భారీ పరస నిర్వహించారు. వివిధ రకాల వస్తువులు, ఆట పరికరాలు ఆకట్టుకున్నాయి. 89వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దొడ్డి కిరణ్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దాడి భాస్కర రావు, ఆలయ కమిటీ సభ్యులు సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు


సుబ్రహ్మణ్యస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఊర్వశి జంక్షన్ కూడలి రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో మాఘ మాస శుద్ధ తదియ మంగళవారాన్ని పురస్కరించుకుని శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి స్కంద పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్రనామం, విభూది, పుష్పలతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ పునఃనిర్మాణ పనులకు భక్తులు, దాతలు ముందుకు రావాలని ఆలయ ధర్మకర్త దేవాల రాజు కోరారు.

## ఘనంగా మరిడిమాంబ తీర్థం


అమ్మవారికిపూజలు చేస్తున్న బద్రీనాథ్ తదితరులు

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవ గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ మరిడిమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకుని పసుపు-కుంకుమ, చీర సారె సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. కార్యక్రమంలో 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా, పూండీ మల్లేష్, సూరాడ పెంటారావు, డొప్ప సన్యాసిరావు, గ్రామ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## కంటి సమస్యలపై అశ్రద్ధ వద్దు

**విద్యార్థులకు అవగాహన సదస్సు**


విద్యార్థులకు కంటి సమస్యలపై అవగాహన కల్పిస్తున్న మణిమాల

సింహాచలం: కంటి సమస్యలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ అండ్ గ్రూప్ సీఈవో కేబీఎస్ మణిమాల సూచించారు. ఎన్‌ఏడీ కొత్తరోడ్డులోని భాష్యం స్కూల్, గోపాలపట్నంలోని ఆళ్వార్‌దాస్ కళాశాల విద్యార్థులకు శంకర్ ఫౌండేషన్‌లో మంగళవారం కంటి సమస్యలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంద్రియాల్లో అధిక ప్రాధాన్యం కంటికి ఉందన్నారు. ప్రపంచాన్ని మనకు చూపించేది కన్ను మాత్రమే అని తెలియజేశారు. కళ్లు లేకపోతే జీవితమంతా అంధకారమే అన్నారు. నేటి విద్యార్థులు కంప్యూటర్స్, స్మార్ట్ ఫోన్స్ వినియోగంలోనే ఎక్కువ సమయం గడపడంతో దృష్టి సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఆదిలోనే దృష్టి సమస్యలను గుర్తిస్తే చిన్నపాటి వైద్యంతోనే నయం చేసుకోవచ్చన్నారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ సువర్ణ, డాక్టర్ సౌమ్య కంటి వైద్యంలో వినియోగిస్తున్న ఆధునిక పరిజ్ఞానాన్ని, శస్త్ర చికిత్సల్లో వినియోగిస్తున్న నూతన పద్ధతులను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి.రమేష్‌కుమార్, సీనియర్ మేనేజర్లు కె.ఎస్.వినోద్, సుభాషిణి, శ్రీధర్ పాల్గొన్నారు. అంతకముందు కంటి ఆరోగ్యంపై గోపాలపట్నం నుంచి నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్‌కు ఆళ్వార్‌దాస్ కళాశాల విద్యార్థులు ర్యాలీగా తరలివచ్చారు.